
అభిమానుల ఆనందోత్సాహం




అశేషంగా తరలి వచ్చిన జనం


ప్రజలకు అభివాదం తెలుపుతున్న చంద్రబాబు నాయుడు

సైకోను తరిమికొట్టండి

- జగన్ బొమ్మల పిచ్చోడు
- రాతియుగానికి స్వస్తి పలకాలి
- స్వర్ణయుగం కోసం నాతో నడవండి
- ఉమ్మడి జిల్లాను పారిశ్రామిక హబ్‌గా మారుస్తా
- సాగు నీటి ప్రాజెక్టుల పెండింగ్ పనులు పూర్తి చేస్తా
- సంక్షోభం నుంచి నాపరాయి పరిశ్రమను గట్టెక్కిస్తా
- పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి కల్పిస్తా
- వైసీపీ పాలనలో వ్యవస్థలు నాశనం
- ఎమ్మెల్యేల అక్రమాలు అన్నీ ఇన్నీ కావు
- రా.. కదిలి రా.. సభలో చంద్రబాబు ధ్వజం

నంద్యాల టౌన్/ఆళ్లగడ్డ, జనవరి 9: రాష్ట్రంలో జలగన్న పాలన రాతియుగాన్ని మరిపిస్తున్నదని, స్వర్ణయుగం రావాలంటే ప్రజలందరూ తనతో కలిసి నడవాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. మంగళవారం ఆళ్లగడ్డలో రా.. కదలిరా బహిరంగ సభలో చంద్రబాబు చేసిన ప్రసంగం వేలాది మంది జనాన్ని ఉర్రూతలూగించింది. బొమ్మల పిచ్చోడు జగన్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు భ్రష్టు పట్టాయని ధ్వజమెత్తారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కర్నూలు, నంద్యాల జిల్లాల అభివృద్ధి అధఃపాతాళంలోకి వెళ్లిపోయిందని అన్నారు. టీడీపీ హయాంలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పుల కోసం నందికొట్కూరు ప్రాంతంలో జైన్ ఇరిగేషన్ ప్రాజెక్టును రూ. 365 కోట్లతో ప్రారంభిస్తే తన్ని తరిమేశారన్నారు. నంద్యాల ప్రాంతాన్ని మెగా సీడ్ హబ్‌గా మార్చేందుకు రూ.650 కోట్లతో ప్రణాళిక చేపట్టామని, ఈ ప్రాజెక్టు పూర్తి అయివుంటే విత్తనోత్పత్తిలో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచేవారమని తెలిపారు. ఓర్వకల్లులో 15 నెలల వ్యవధిలో ఎయిర్‌పోర్టు నిర్మాణం, పారిశ్రామిక వాడ అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. ఎమ్మిగనూరుకు టెక్స్‌టైల్ పార్కు తెస్తే దానికి కూడా మోకాలడ్డారని ధ్వజమెత్తారు. కర్నూలుకు హైకోర్టు తీసుకువస్తామని చెప్పిన అధికార పార్టీ నాయకులు చేతులెత్తేసిన విషయాన్ని ప్రజలంతా తెలుసుకోవాలని కోరారు. టీడీపీ హయాంలో ఆరు వేల మెగావాట్ల ఉత్పత్తితో నిర్మించిన సోలార్ పవర్ ప్రాజెక్టు ప్రపంచంలోనే పెద్దదని తెలిపారు.



ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేస్తాం

ఉమ్మడి జిల్లాలో ముచ్చుమర్రి, పులికనుమ, అలగనూరు, గోరుకల్లు, అవుకు తదితర సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేశామని నారా చంద్రబాబు భరోసా ఇచ్చారు. వైసీపీ పాలనలో రిజర్వాయర్లు దెబ్బతిని నీటి నిలువకు ఇబ్బందులు పడుతుంటే మరమ్మతులకు సైతం నిధులు మంజూరు చేయని దుస్థితి నెలకొందన్నారు. సీఎం జగన్ ఒక్క సాగు నీటి ప్రాజెక్టునైనా కట్టాడా అని ప్రశ్నించారు. రాయలసీమను రత్నాల సీమగా మార్చేందుకు, ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తెలుగుగంగ పథకం చేపట్టి చరిత్రలో చిరస్మరణీయుడయ్యాడని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేసి బంగారు పంటలు పండే విధంగా చేయడమే తన లక్ష్యమని చంద్రబాబు పేర్కొన్నారు. వైసీపీ పాలన మొత్తం అరాచక, అవినీతి, అక్రమార్జనలు, వేధింపులు, అక్రమ కేసులమయంగా మారిందని విమర్శించారు. నంద్యాలలో అబ్దుల్ సలాం కుటుంబం ఆత్మహత్య, ప్రొద్దుటూరులో నందం సుబ్బయ్య హత్య ఇలా చెప్పుకుంటూ పోతే కోకొల్లలని, వైసీపీ అరాచక పాలనకు ఇవి ప్రత్యక్ష నిదర్శనాలున్నాయని అన్నారు.

ఉమ్మడి జిల్లాకు మహర్దశ తేవడమే లక్ష్యం

టీడీపీ అధికారంలోకి వచ్చాక ఉమ్మడి జిల్లాకు మహర్దశ కల్పించడమే లక్ష్యమని చంద్రబాబు పేర్కొన్నారు. ఓర్వకల్లు మండలంలో మల్లికార్జున రిజర్వాయరు ఫీడర్ చానల్ పూర్తి చేస్తామని తెలిపారు. డోన్, పత్తికొండ నియోజకవర్గాల్లోని చెరువులకు నీళ్లు నింపే ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీ ఇచ్చిరు. వేదవతిని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం సిద్ధాపురం ఇరిగేషన్ ప్రాజెక్టుకు కనీసం కరెంటు బిల్లులు కట్టడం లేదని, ఈ పరిస్థితిని చక్కదిద్దుతామని చెప్పారు. మిడుతూరు లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేస్తామని, నందికొట్కూరుకు పరిశ్రమలు తెస్తామని భరోసా ఇచ్చారు. బనగానపల్లె నియోజకవర్గంలో పెద్దకొప్పెర్ల ఎత్తిపోతల పథకం పూర్తి, కుందూ నదిపై చెక్‌డ్యాంలు నిర్మిస్తామన్నారు.

రాయలసీమను ఏం ఉద్ధరిస్తాడు?

రాయలసీమలో ఇరిగేషన్ కోసం టీడీపీ ఐదేళ్ల పాలనలో రూ.12,454 కోట్లు ఖర్చు చేస్తే కనీసం 25 శాతం కూడా జలగన్న ఖర్చు చేయలేదని, ఇలాంటి వ్యక్తి రాయలసీమను ఉద్ధరిస్తాడా? అని చంద్రబాబు ధ్వజమెత్తారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో అలగనూరు రిజర్వాయరుకు మరమ్మతులు చేస్తామన్నారు. రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు సాగు నీటి ప్రాధాన్యత, 90 శాతం రాయితీతో డ్రిప్ రైతులకు అందజేస్తామన్నారు. పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. టీడీపీ హయాంలో రోడ్ల అభివృద్ధి చేశామని, జాతీయ రహదారుల నిర్మాణం, తిరుపతిని అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు స్థాయికి పెంపు చేశామని తెలిపారు.


ఆళ్లగడ్డలో దివ్యాంగుడితో కారు దిగి మాట్లాడుతున్న చంద్రబాబు


భూమా శోభా నాగిరెడ్డి ఘాట్ వద్ద నివాళి అర్పిస్తున్న చంద్రబాబు నాయుడు

నాపరాయి పరిశ్రమను ఆదుకుంటాం

సంక్షోభంలో ఉన్న నాపరాయి పరిశ్రమను ఆదుకునేందుకు గతంలో ఉన్న పద్ధతులను చేపడతామన్నారు. బనగానపల్లె-కోవెలకుంట్ల బైపాస్ రోడ్డును నిర్మిస్తామని చెప్పారు. ఉమ్మడి జిల్లాను పారిశ్రామక హబ్‌గా మారుస్తామని వివరించారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని, హంద్రీ-నీవా, గాలేరు-నగరి పూర్తి చేస్తామని వెల్లడించారు. తుంగభద్ర, హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీలను ఆధునికీకరిస్తామని, గుండ్రేవుల ప్రాజెక్టును పూర్తి చేస్తామని, ఆర్డీఎస్ కుడి కాలువ పూర్తి చేసి వాటర్‌గ్రిడ్ ద్వారా ఇంటింటికి నీరందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఇన్‌చార్జి భూమా అఖిలప్రియ, యువ నాయకులు భూమా విఖ్యాత్‌రెడ్డి, భార్గవ్‌రామ్‌నాయుడు, నంద్యాల టీడీపీ ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్, మాజీ మంత్రులు కేఈ ప్రభాకర్, సి.రామచంద్రయ్య, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, పార్లమెంటు ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వెదుర్ల రామచంద్రరావు, ఏవీఆర్ ప్రసాద్, తాతిరెడ్డి తులసిరెడ్డి, జిల్లెల శ్రీరాములు, గడ్డం రామకృష్ణారెడ్డి, పోతురాజు రవికుమార్, వై.నాగేశ్వరయాదవ్, గోగిశెట్టి నరసింహారావు, కార్యనిర్వాహక కార్యదర్శి వహబ్, ఆళ్లగడ్డ జనసేన సమన్వయకర్త మైలేరి మల్లయ్యతోపాటు టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


వేదికపై టీడీపీ నాయకులు

మీరూ మా కుటుంబ సభ్యులే..

- అధైర్యపడకండి టీడీపీ అండగా ఉంటుంది
- కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన నారా భువనేశ్వరి
- ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల సాయం

కర్నూలు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి)/ఎమ్మిగనూరు: 'అప్పులు దూరమైతే ఆ బాధ ఎలా ఉంటుందో మాకు తెలుసు. ఇకపై మీరూ మా కుటుంబ సభ్యులే. అధైర్యపడవద్దు.. మీకు అండగా టీడీపీ ఉందని చెప్పేందుకే చంద్రబాబు నాయుడు నన్ను పంపించారు. ధైర్యంగా ఉండండి..' అంటూ నారా భువనేశ్వరి బాధిత కుటుంబాలను ఓదార్చారు. టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' పర్యటనలో భాగంగా మంగళవారం ఎమ్మిగనూరు, ఆదోని నియోజకవర్గాల్లో పర్యటించారు. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక తీవ్రమనోవేదనకు లోనై మృతి చెందిన టీడీపీ కుటుంబాలను ఆమె పరామర్శించారు. పెద్దకడుబూరులో చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక టీడీపీ కార్యకర్త హెచ్.గోపాల్ మృతి చెందారు. ఆయన ఇంటికి వెళ్లిన భువనేశ్వరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గోపాల్ భార్య జయశీలమ్మను ఓదార్చారు. ఈ సందర్భంగా జయశీలమ్మ 'మాట్లాడుతూ మీరు మా ఇంటికి రావడం మా అదృష్టం.. మా ఆయన టీడీపీ కోసం ఓసైనికుడిగా చివరిదాకా పనిచేశాడు. మీరు ఇచ్చిన భరోసా ఎంతో ధైర్యాన్నిచ్చింది. మా పిల్లల్ని బాగా చదివించుకుంటా'మన్నారు. అనంతరం గోపాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. కౌతాళం మండలం వల్లూరు గ్రామానికి చేరుకున్న భువనేశ్వరి వడ్డే ఈరమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈరమ్మ భర్త వడ్డే ఈరయ్య, కుమారులు పెద్దనాగేష్, చిన్న నాగేష్‌లకు ధైర్యం చెప్పారు. కన్నీటి పర్యంతమైన ఈరయ్యను ఓదార్చి చెక్కును అందజేశారు. మంత్రాలయం పట్టణంలోని రామచంద్రనగర్‌లో చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన టీడీపీ కార్యకర్త రాగమ్మ కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. భర్త ఆంజనేయులు, కుటుంబ సభ్యులు లక్ష్మి, మనుమలు భీమేష్, మల్లేష్‌లను పరామర్శించారు. చంద్రబాబు అండగా ఉంటారని ఆమె ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. 'సాధారణ కార్యకర్త కుటుంబాలను పరామర్శిస్తారని అనుకోలేదమ్మా. మీరు మాపై చూపిన అభిమానానికి వందనాలు...' అంటూ భువనేశ్వరితో అన్నారు.

నారా భువనేశ్వరి వెంట టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, టీడీపీ రాష్ట్ర నాయకురాలు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మంత్రాలయం, కోడుమూరు, ఆలూరు నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు తిక్కారెడ్డి, ఆకెపోగు ప్రభాకర్, కోట్ల సుజాతమ్మ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసరెడ్డి, తెలుగు రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రమాకాంతరెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు గుడిసె కృష్ణమ్మ, ఉలిగయ్య, కోసిగి మాజీ సర్పంచ్ ముత్తురెడ్డి, టీడీపీ నాయకులు మాధవరం రామమేంద్రరెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, తెలుగు మహిళా నాయకురాళ్లు వెంకటేశ్వరమ్మ, కల్పన, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు యేసేపు తదితరులు పాల్గొన్నారు.


కౌతాళం మండలం హాల్విలో ప్రజలకు అభివాదం తెలుపుతున్న భువనేశ్వరి


వడ్డె ఈరయ్యను ఓదార్చుతూ..


జయశీలమ్మకు చెక్కు ఇస్తూ..


మంత్రాలయం రామచంద్ర నగర్‌లో..

నీ సలహాలు అక్కర్లేదు

- సీఎంకు మాత్రమే సలహాదారువు.. మాకు కాదు
- సజ్జలపై విరుచుకుపడ్డ అంగన్‌వాడీ కార్యకర్తలు



రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 9: రాబోయే ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని, ఇప్పుడు విధుల్లో చేరి ప్రభుత్వానికి సహకరించాలని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సలహాపై ఆందోళనకారులు మండిపడ్డారు. మంగళవారంతో సమ్మె 29వ రోజుకు చేరుకున్న సందర్భంగా అంగన్‌వాడీలు జైలుభరో కార్యక్రమం చేపట్టారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణ నుంచి భారీ ర్యాలీ చేసి రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు వారిని అరెస్టు చేసి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ నాయకురాలు కృష్ణవేణమ్మ మాట్లాడుతూ సీఎం జగన్‌కు సలహాదారైన సజ్జల రామకృష్ణారెడ్డి వీలైతే సీఎంకు సలహా ఇచ్చి అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించాల్సిందిపోయి తమకు సలహాలు ఇవ్వడం విడ్డూరంగా ఉందని అన్నారు. సజ్జల సీఎంకు సలహాదారేగాని అంగన్‌వాడీలకు కాదని, ఆయన సలహాలు తమకు అక్కరలేదని అన్నారు.


ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న చంద్రబాబు


చంద్రబాబు నాయుడుతో బీసీ జనార్దన్‌రెడ్డి మాటా మంతి


వేదికపైన మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, మాండ్ర శివానందరెడ్డి


వేదికపైన కే.ఈ. ప్రభాకర్, రామచంద్రయ్య, గౌరు వెంకటరెడ్డి, ధర్మవరం


వేదికపై జిల్లా పరిశీలకుడు, అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి




చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న అబ్దుల్ వహీద్


చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న భూమా బ్రహ్మానందరెడ్డి, విఖ్యాత్‌రెడ్డి





ఎమ్మెల్యేలపై చంద్ర నిప్పులు

నంద్యాల టౌన్/ఆళ్లగడ్డ, జనవరి 9: ఆళ్లగడ్డలో మంగళవారం నిర్వహించిన 'రా..కదలిరా' బహిరంగ సభలో నంద్యాల జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యేలపై వారి అవినీతి అక్రమాలను ఉద్దేశించి చంద్రబాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు.

● ఆళ్లగడ్డ ఎమ్మెల్యే కడుపుకు అన్నం తినడు. ఇసుక, ఎర్రమట్టి, అక్రమ మద్యం ద్వారా వచ్చిన సొమ్మును తింటున్నాడు. ఈయన చాలా బిజీ అంట. ఈయనను ఆపే ధైర్యం జగన్‌కు కూడా లేదంట. అంటూ గంగుల బిజేంద్రారెడ్డి తీరుపై విమర్శనాస్త్రాలు సంధించారు.

● నంద్యాలలో ఉన్న ఎమ్మెల్యేను సండే ఎమ్మెల్యే అంటారు. జాతీయ రహదారి 167ను అష్టవంకర్లు తిప్పిన ఘనత ఈయనదేంటూ శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డికి చురకలంటించారు.

● జగన్నాథగట్టును కొల్లగొట్టి కేజీఎఫ్‌గా మార్చి వందలాది ఎకరాలను కొల్లగొట్టిన కలెక్షన్ కింగ్ పాణ్యం ఎమ్మెల్యే అని కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడారు.

● ఈయన కన్ను పడితే వెంచర్లను సైతం ధారాదత్తం చేయాల్సిందే.. వెంచర్ల శిల్పా అంటూ శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తీరును ఎండగట్టారు.

● బ్రహ్మం గారు కాలజ్ఞానం రాసిన ప్రాంతం రవ్వలకొండను మింగేశాడని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని ఉద్దేశించి విమర్శించారు.

● నందికొట్కూరులో అమాయకపు ఎమ్మెల్యే ఉన్నాడని ఆర్థర్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. అక్కడో హీరో ఉన్నాడు. రాష్ట్రమంతా ఏదో చేస్తాడంట అంటూ బైరెడ్డి సిద్దార్థరెడ్డిపై చంద్రబాబు విరుచుకపడ్డారు.

● జిల్లాలో పిట్టకథల మంత్రి ఉన్నాడని, కమ్మగా మాట్లాడుతాడని చేసేది మాత్రం ఏమీ ఉండదని, సినిమా యాక్టర్ నాగభూషణాన్ని మించి పోతాడని మంత్రి, డోన్ ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథరెడ్డిని విమర్శించారు.

తప్పుడు కేసులతో జైలుకు పంపారు : భూమా అఖిలప్రియ



ఆళ్లగడ్డ: టీడీపీ యువ నేత నారా లోకేశ్‌పై ఎమ్మెల్యేలు శిల్పా రవి, శిల్పా చక్రపాణి, గంగుల బిజేంద్రారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేస్తే తాను ఘాటుగా స్పందించానని, దీంతో తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపారని మాజీ మంత్రి, ఆళ్లగడ్డ అసెంబ్లీ టీడీపీ ఇన్‌చార్జి భూమా అఖిలప్రియ అన్నారు. చంద్రబాబు బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు అవినీతిపరులుగా మారారని ధ్వజమెత్తారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, ఆయన తల్లి సాగిస్తున్న అక్రమార్జన మితిమీరిందన్నారు. మంత్రిగా ఆళ్లగడ్డ నియోజకవర్గాన్ని అన్ని రంగాలుగా అభివృద్ధి చేశానని తెలిపారు.

వైసీపీని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధం : గౌరు చరిత

వైసీపీని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. అందరం బాగుండాలంటే చంద్రబాబునాయుడును సీఎంను చేసుకోవాలని కోరారు. నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో అన్ని రంగాల వారు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. మహిళలకు రక్షణ లేదని, యువతకు ఉపాధి అవకాశాలు లేవని, రైతుల విద్యుత్ మోటార్లకు మీటర్లు పెడుతున్నారని ఆరోపించారు.

రైతాంగం దెబ్బతింటోంది : గౌరు వెంకటరెడ్డి



కేసీ, తెలుగుగంగ కాలువలు, హంద్రీ-నీవా ప్రాజెక్టులను సక్రమంగా పని చేసేలా చేయకపోవడంతో నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని గౌరు వెంకటరెడ్డి అన్నారు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని కోరుకోవాలన్నారు. సీపీఎస్ రద్దు చేస్తానని చెప్పి మాట తప్పారని, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లను ఇబ్బందులకు గురి చేయడంతో రోడ్డెక్కారని అన్నారు.

వంద రోజుల్లో కాబోయే సీఎం చంద్రబాబు : సుబ్బారెడ్డి



వంద రోజుల్లో కాబోయే సీఎం చంద్రబాబునాయుడని ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

సభను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు : మల్లెల



రా.. కదలిరా బహిరంగ సభను విజయవంతం చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు చెబుతున్నా అని జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. బనగానపల్లె ఎమ్మెల్యే తమ దైన శైలిలో భూదందాలు, అక్రమార్జనలకు పాల్పడుతున్నారని విమర్శించారు. చంద్రబాబు సభకు భారీ ఎత్తున అభిమానులు హాజరైనందుకు ధన్యవాదాలు తెలిపారు.

వైరి వర్గానికి టికెట్?

● మంత్రి గుమ్మనూరు జయరాం ఆగ్రహం

● బీసీ మహిళ బొజ్జమ్మకు షాకిచ్చిన వైసీపీ

కర్నూలు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గంలో చిప్పగిరి జడ్పీటీసీ సభ్యుడు విరూపాక్షికి దాదాపు టికెట్ ఖరారైనట్లు సమాచారం. తాడేపల్లికి రావాలంటూ ఇప్పటికే విరూపాక్షికి ఫోన్ కాల్ వచ్చింది. ఈ నేపథ్యంలో వైరి వర్గానికి టికెట్ ఇవ్వడంపై మంత్రి గుమ్మనూరు జయరాం అనుచరులు రగిలిపోతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి గుమ్మనూరు జయరాంకు కర్నూలు ఎంపీ టికెట్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. నిజానికి ఆయన ఆలూరు నుంచే మళ్లీ టికెట్ కావాలని పట్టుబట్టారు. ఆలూరు నుంచి టికెట్ దక్కకపోతే నియోజకవర్గంలో తనకు, తన కేడర్‌కు అవమానం అన్న రీతిలో గుమ్మనూరు వర్గం ఉన్నట్లు తెలుస్తోంది. అవన్నీ లెక్కచేయని సీఎం జగన్ మోహన్ రెడ్డి గుమ్మనూరుకు చెక్ పెట్టి విరూపాక్షి పెద్దపీట వేశారు. తాను టికెట్ ఇస్తే జడ్పీటీసీగా గెలిచిన వ్యక్తి ఇప్పుడు తన సీటుకే ఎసరు పెట్టడంపై గుమ్మనూరు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు ఆ పార్టీలోని వారే చర్చించుకుంటున్నారు. ఇక మొదట్నుంచీ టికెట్ ఇస్తామని ఆశ చూపి బీసీ మహిళ కప్పట్రాళ్ల బొజ్జమ్మకు సీఎం జగన్ షాక్ ఇచ్చినట్లు తెలుస్తోంది. టికెట్ ఇస్తామని ఆశచూపి ఇప్పుడు 'లేదు పో' అన్నరీతిలో వైసీపీ అధిష్ఠానం వ్యవహరించడంపై బొజ్జమ్మ ఆవేదనతో ఉన్నారు.

జయరామ్‌కు టికెట్ ఇవ్వాల్సిందే..: వైసీపీ


హాలహర్విలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టిన వైసీపీ నేతలు

హాలహర్వి, జనవరి 9: మంత్రి జయరాంకు కాకుండా, వేరే వారికి ఆలూరు సీటు కేటాయిస్తే ఊరుకునేది లేదని వైసీపీ నాయకులు సీఎం జగన్మోహన్ రెడ్డికి వార్నింగ్ ఇచ్చారు. మంగళవారం మంత్రి గుమ్మనూరు జయరాం మద్దతుదారులు ఆగ్రహంతో రాస్తారోకో నిర్వహించారు. ఆలూరు సీటుకు అభ్యర్థిని మార్చడం దారుణమని, సీఎం తీరు మారకపోతే తమ పదవులకు రాజీనామా చేస్తామని హాలహర్వి జెడ్పీటీసీ లింగప్ప, మండల కన్వీనర్ భీమప్ప చౌదరి అన్నారు. తప్పుడు సర్వేలతో ఆలూరు సీటు వేరెవరికైనా కేటాయిస్తే తాము ఓడించి తీరుతామని వైసీపీ నేతలు అధినేతకు వార్నింగ్ ఇవ్వడంతో చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు రాజశేఖర్, లింగమల్లప్ప, బసవరాజు పాల్గొన్నారు.

విధులకు 218 మంది అంగన్‌వాడీలు

కర్నూలు కలెక్టరేట్ జనవరి 9 : ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించిన నేపథ్యంలో మంగళవారం జిల్లాలో 112 మంది అంగన్‌వాడీలు విధులకు హాజరయ్యారు. జిల్లాలో 1,886 అంగన్‌వాడీ కేంద్రాలలో 1,866 మంది టీచర్లు, 1,823 హెల్పర్లు పనిచేస్తున్నారు. 29 రోజుల నుంచి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించింది. దీంతో మంగళవారం 112 మంది విధులకు హాజరయ్యారని ఐసీడీఎస్ పీడీ వెంకటక్ష్మి తెలిపారు.

11 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు

కర్నూలు(అర్బన్), జనవరి 9: రాయలసీమ యూనివర్సిటీలో ఈనెల 11 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు ఉంటాయని రిజిస్ట్రార్ వెంకట సుందరానంద పుచ్చా తెలిపారు. వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలు, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్, హెడ్స్, కోఆర్డినేటర్స్, ఇన్‌చార్జిలు, విద్యార్థులు విషయాన్ని తెలుసుకొని తిరిగి కళాశాలలు పునః ప్రారంభ రోజు తరగతులకు హాజరు కావాలని కోరారు.

కర్నూలు(ఎడ్యుకేషన్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు ఈ నెల 11వ తేదీ నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించినట్లు జిల్లా వృత్తి విద్యా అధికారి జమీర్ పాషా మంగళవారం తెలిపారు. సంక్రాంతి సెలవుల అనంతరం ఈ నెల 19వ తేదీ నుంచి కళాశాలలు పునఃప్రారంభంకానున్నట్లు ఆయన వివరించారు.

'భవిష్యత్‌కు గ్యారెంటీ'లో కర్నూలుకు ఆరో స్థానం

అధినేత చంద్రబాబును కలిసిన టీజీ భరత్

కర్నూలు(అర్బన్), జనవరి 9: నిత్యం ప్రజల్లో ఉంటూ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని చురుగ్గా నిర్వహిస్తున్న కర్నూలు నియోజకవర్గానికి టీడీపీ గుర్తింపునిచ్చింది. భవిష్యత్ గ్యారెంటీని చక్కగా నిర్వహించడంలో కర్నూలు నియోజకవర్గంలో ఆరో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మంగళవారం టీడీపీ జాబితాను విడుదల చేసింది. ఇందుకు కృషి చేసిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టీజీ భరత్‌ను పార్టీ అభినందించింది. ఈ సందర్భంగా మంగళవారం ఆళ్లగడ్డలో చంద్రబాబును టీజీ భరత్ ప్రత్యేకంగా కలిశారు. అధినేతతో సమావేశమై నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని, నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఇప్పటికే నియోజకవర్గంలో 58 వేల ఇళ్లకు 'బాబు ష్యూరిటీ. భవిష్యత్ గ్యారెంటీ' రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినందుకు చంద్రబాబు అభినందించినట్లు టీజీ భరత్ తెలిపారు. చంద్రబాబును కలిసిన వారిలో నియోజకవర్గం పరిశీలకులు శ్రీనివాసమూర్తి, జనసేన అసెంబ్లీ ఇన్‌చార్జి ఆర్షద్ తదితరులు పాల్గొన్నారు.


చంద్రబాబును కలిసిన టీజీ భరత్, కర్నూలు టీడీపీ నాయకులు

నిజాయితీగా పని చేసే వారిని ఎన్నుకోవాలి

కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యపాల్‌సింగ్ బాగేల్


వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

కర్నూలు(రూరల్) జనవరి 9: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే నిజాయితీగా పనిచేసేవారినే ఎన్నుకోవాలని, కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యపాల్‌సింగ్ బాగేల్ ప్రజలకు పిలుపునిచ్చారు. కర్నూలు రూరల్ మండలం గార్గేయపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వికసిత భరత్ సంకల్పయాత్రలో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన బహిరంగ సభకు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యపాల్ సింగ్ బాగేల్, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ. వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మాట్లాడుతూ కులాలు, మతాల పేరుతో విడిపోకుండా అభివృద్ధి, దేశ సమగ్రతే లక్ష్యంగా ప్రజలు తమ నాయకులను ఎన్నుకోవాలని కోరారు. మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ గార్గేయపురం గ్రామంతో తనకు ఎంతోమంచి అనుబంధం ఉందని అన్నారు. తన తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచినపుడు తన (కర్నూలు అసెంబ్లీ) పరిధిలో ఉండేదన్నారు. మంచినీటి వసతి కూడా సరిగా ఉండేది కాదని, తన హయాంలో గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశానని అన్నారు.

అనంతరం పాఠశాల మైదానంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన 12 స్టాల్స్‌ను కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ బాగాల్, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, బీజేపీ నాయకులు రామస్వామి, వినూషారెడ్డి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లాకు 3.96 లక్షల ఆయుష్మాన్ కార్డులు

కర్నూలు(కల్చరల్): భారతదేశంలో ఎప్పుడూ లేని విధంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని, ఏపీలో 1.51 కోట్ల ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేశామని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ఎస్‌పీ సింగ్ బాగేల్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన కర్నూలు సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ సీఎల్‌జీలో మీడియాతో మాట్లాడారు. ఆయుష్మాన్ కార్డులు, ఉచిత బియ్యం, సిలిండర్లు, కిసాన్ సమ్మాన్ నిధి, పింఛన్లను కేంద్ర ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. కర్నూలు సర్వజన వైద్యశాలలో స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని, ఈ ఆసుపత్రికి కేంద్రం వాటా రూ.72 కోట్లు కాగా, ఇప్పటికే రూ.54 కోట్లు విడుదల చేశామని, మరో రూ.18 కోట్లు కూడా త్వరలో విడుదల చేస్తామని చెప్పారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట రంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకరరెడ్డి ఆసుపత్రికి కొత్తగా 3-టెస్లా ఎంఆర్‌ఐ మిషన్‌ను మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పించారు.

రాఘవేంద్రుని సన్నిధిలో ప్రముఖులు

మంత్రాలయం, జనవరి 9: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఏపీ అసెంబ్లీ ఎస్టిమేట్ కమిటీ చైర్మన్ కళావతి, కర్నూలు అడిషనల్ జిల్లా జడ్జి ప్రతిభాదేవి మంగళవారం వేర్వేరు సమయాల్లో మంత్రాలయం వచ్చారు. వీరికి మఠం అధికారులు ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. వారు గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు


మంచాలమ్మను దర్శించుకుంటున్న కర్నూలు అడిషనల్ జిల్లా జడ్జి ప్రతిభాదేవి

రోడ్లు, కాలువలు, నీరు, వీధి లైట్లు కావాలి

● నగరంలోని శివారు కాలనీ అసోసియేషన్ల ధర్నా



నగరంలోని ఏడు కాలనీల అసోసియేషన్ల ధర్నా

కర్నూలు(అర్బన్), జనవరి 9: శివారు కాలనీల్లో రోడ్లు, కాలువలు, త్రాగు నీరు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని శివారు కాలనీల అసోసియేషన్ల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ ఎదుట ధర్నా నిర్వహించారు. నాయకులు ఏ. వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, నాయకులు డి. సుకుమార్ మాట్లాడుతూ మురికి కాలువలు లేక మురికి నీరు ఖాళీ సైట్లలోకి చేరుకుని కంపచెట్లు పెరిగి పందులు, పాములకు అవాసాలుగా మారాయని మండిపడ్డారు. పలు కాలనీలకు తాగు నీరు, వీధిలైట్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం నగర పాలక సంస్థ మేనేజర్ చిన్నరాముడుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కే. శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి, ఎస్ ఆర్ గౌడ్, సీవీ రమణ పాల్గొన్నారు.

రక్తదాన కార్యక్రమాన్ని విజయవంతం

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 9: రాష్ట్రోపాధ్యాయ సంఘం 75 వసంతాల వజ్రోత్సవ వేడుకలను పురస్కరించుకొన్ని ఎస్టీయూ జిల్లా శాఖ అధ్వర్యంలో మంగళవారం స్థానిక రెడ్ క్రాస్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ రక్తదాన శిబిరంలో 75 మంది ఉపాధ్యాయులు రక్తదానం చేశారు. కార్యక్రమానికి నగర మేయర్ బి వై రామయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్. తిమ్మన్న, అదనపు ప్రధాన కార్యదర్శి సి. నాగరాజు, జిల్లా అధ్యక్షుడు ఎస్. గోకారి, ప్రధాన కార్యదర్శి టి కె జనార్ధన్, అర్థిక కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, బసవ రాజు, ఎస్. ముదాసిర్ అహమ్మద్, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

7వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె



గూడూరులో పొర్లు దండాలు పెట్టి నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కర్నూలు(అర్బన్), జనవరి 9: మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె 7వ రోజుకు చేరింది. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు బిక్షాటన చేసిన కార్మికులు, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని నినాదాలు చేశారు. ఈసందర్భంగ ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి, చంద్రశేఖర్, ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏడు రోజుల నుంచి సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే వచ్చే ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగోషలు, సాములు, ఏసన్న, సవారి, నాగేంద్ర షాలు, పద్మావతి, మహేశ్వరీ, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: మున్సిపల్ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం పొర్లు దండాలు పెట్టి వినూత్న నిరసన తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్మికుల ఉద్యోగుల పర్మినెంట్, సమాన పనికి సమాన వేతనం కోసం మున్సిపల్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మె గూడూరులో 15వ రోజుకు చేరుకోంది. సమ్మెలో భాగంగా గూడూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకుడు శాంతన్న అధ్యక్షతన మున్సిపల్ కార్మికులు పొర్లు దండాలు పెట్టి వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మనోహరమ్మ, లక్ష్మీదేవి, గోపాల్, గుంతన్నదాసు, రాజు, వెంకటేశ్వరమ్మ, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలి

● ఆర్‌యూ ఉపకులపతి



ఆర్‌యూలో వసతి గృహాలను పరిశీలిస్తున్న వీసీ

కర్నూలు(అర్బన్), జనవరి 9: వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలని, విద్యార్థుల సేవే లక్ష్యంగా ఉద్యోగులు పని చేయాలని ఉపకులపతి ప్రొఫెసర్ ఫజలూర్ రహమాన్ అన్నారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో యూనివర్సిటీ అనుబంధ వసతి గృహాల్లో సౌకర్యాలను మెరుగుపరచడానికి అవసరమైన చర్యలపై సంబంధింత అధికారులతో మాట్లాడారు. వసతి గృహాల్లో వసతులు అధ్వానంగా ఉన్నాయంటూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన వసతి గృహాలను పరిశీలించారు. వసతి గృహంలోని సౌర్యాలను విద్యార్థులు, వార్డెన్‌లను అడిగి తెలుసుకున్నారు. వంటశాలలు, స్నానపు గదుల్లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధింత అధికారులను ఆదేశించారు.

నేడు మండల స్థాయి క్రీడా పోటీలు

సి. బెళగల్, జనవరి 9: మండల కేంద్రలంలో గురుకుల స్టేడియం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. కబడ్డీ, క్రికెట్, బ్యాట్మెంటన్, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ క్రీడాల్లో గెలుపు ఓటములు సహజమేనని అన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు పంపిణీ చేస్తామని తెలిపారు.

ప్రణాళిక శిక్షణ కార్యక్రమం



మాట్లాడుతున్న నాసరరెడ్డి

కర్నూలు కలెక్టర్ జనవరి 9 : గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024-25 శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నాసరరెడ్డి జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం యొక్క 60 శాతం నిధులలో 30 శాతం తాగునీటికి, 30 శాతం పారుశుధ్యానికి కేటాయించాలన్నారు. 40 శాతం నిధులలో 25 శాతం ఎంపిక చేసుకున్న థీమ్‌కు కేటాయించడం జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీ తీర్మానం ద్వారా ప్రతి గ్రామ పంచాయతీ 2024-25 ప్రణాళికలను ఇ-గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని అన్నారు.

పోలకల్లులో పల్లె నిద్ర

సి. బెళగల్, జనవరి 9: మండలంలోని పోలకల్లు గ్రామంలో మంగళవారం కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ మన్మథవిజయ్ పల్లె నిద్ర చేశారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలందరూ కలిసి మెలసి జీవించాలన్నారు. పొలం గట్ల సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారులను సంప్రదించి పొలాలను కొలుతలు వేయించకోవాలని రైతులకు సూచించారు.



ఆదోనిలో భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న దృశ్యం



కౌతాళం మండలం వల్లూరు గ్రామంలో వడ్డె ఈరమ్మకు నివాళి అర్పిస్తున్న భువనేశ్వరి



ఓర్వకల్లు విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న బీటీ నాయుడు

పల్లెపల్లెనా భువనేశ్వరికి



ఘన స్వాగతం



కర్నూలు, జనవరి 9(ఆంధ్రజ్యోతి)/ఎమ్మిగనూరు/ఆదోని: నిజం గెలవాలి యాత్రలో భాగంగా జిల్లాకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరికి పల్లెపల్లెన ప్రజలు నీరాజనాలు పలికారు. అమ్మను చూడాలి.. ఆశీర్వచనాలు అందించాలంటూ పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు, మహిళలు రోడ్లపైకి వచ్చి అభివాదం తెలిపారు. పెద్దకడుబూరు, కోసిగి, దుద్ది, కోలమాన్‌పేట, అర్లబండ, హాల్వీ గ్రామాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు, జనం రోడ్లపైకి వచ్చి భువనేశ్వరికి హారతులు పట్టారు. కోసిగిలో భువనేశ్వరిని చూసి ఆశీర్వదించేందుకు వాల్మీకి సర్కిల్‌కు ప్రజలు వేలాధిగా తరలివచ్చారు. వల్లూరు నుంచి మంత్రాలయానికి బయల్దేరిన భువనేశ్వరికి కడుదొడ్డి, కందుకూరు, సాతనూరు, అగసనూరు, నారాయణపురం, తుంగభద్ర గ్రామాల్లో సైతం రాత్రి అయినా కూడా భువనేశ్వరిని చూసేందుకు రోడ్లపైకి చేరుకొని అభివాదం చేస్తూ అభిమానాన్ని చాటుకున్నారు.

● ఆదోనిలో భువనేశ్వరి బస

'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా పెద్దకడుబూరు, కౌతాళం, మంత్రాలయం మండలాల్లో చంద్రబాబు అరెస్టు సమయంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందించిన అనంతరం రాత్రి సుమారు 9గంటల సమయానికి ఆదోనికి చేరుకున్నారు. మండిగిరిలోని చేకూరి పుల్లయ్య ఫంక్షన్‌హాల్‌లో రాత్రి బసచేశారు. ఆదోని ఇన్‌చార్జి మీనాక్షినాయుడు ఆధ్వర్యంలో భువనేశ్వరితో పాటు యాత్రలో పాల్గొన్న టీం సభ్యులకు బస ఏర్పాట్లు చేశారు. ఆదోని మండలం అరెకల్లు గ్రామ శివారులో నారా భువనేశ్వరికి మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో తెలుగు యూత్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, బత్తిన కుబేర్‌నాథ్, మారుతి నాయుడు, రంగన్న, రామకృష్ణ, తిమ్మప్ప, బాబు నాయుడు, బంగారు సుధాకర్ పాల్గొన్నారు.

విమానాశ్రయంలో ఘన స్వాగతం

రెండు రోజుల పర్యటనలో భాగంగా జిల్లాకు వచ్చిన భువనేశ్వరికి టీడీపీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఓర్వకల్లు విమానాశ్రయంలో చేరుకున్న ఆమెకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు సహా పలువురు టీడీపీ నాయకులు స్వాగతం పలికి ఆమెతో పాటు యాత్ర కొనసాగించారు. గోనెగండ్ల మండలం గాజులదిన్నె దగ్గర ఎమ్మిగనూరు టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి భువనేశ్వరికి స్వాగతం పలికారు. భువనేశ్వరికి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అక్కడే మధ్యాహ్న భోజనం అనంతరం మంత్రాలయం నియోజకవర్గానికి బయల్దేరారు. పెద్దకడుబూరు చేరుకున్న భువనేశ్వరికి మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు.

● మీ సమస్యలు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తా

అంగన్‌వాడీ వర్కర్లు 29 రోజులుగా చేస్తున్న సమ్మె న్యాయబద్ధమైంది. మీ డిమాండ్లు న్యాయమైనవే. మీ సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి మన ప్రభుత్వం రాగానే పరిష్కరించాలని తప్పకుండా చెబుతానని అంగన్‌వాడీ వర్కర్లకు నారా భువనేశ్వరి భరోసా ఇచ్చారు. పెద్దకడుబూరులో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు భువనేశ్వరిని కలిసి తమ సమస్యల పరిష్కారం దిశగా కృషి చేసేలా టీడీపీ మద్దతు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ అంగన్‌వాడీలకు ఎప్పుడు అండగా ఉంటుందని భువనేశ్వరి వివరించారు. త్వరలో టీడీపీ ప్రభుత్వం వస్తుందని, అంగన్‌వాడీల సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఆమె భరోసానిచ్చారు.

ఓర్వకల్లు: కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా హైదరాబాదు నుంచి ఓర్వకల్లు విమానాశ్రయానికి నారా భువనేశ్వరి మంగళవారం చేరుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టు వార్త విని మరణించిన కుటుంబాలను పరామర్శించేందుకు మంత్రాలయానికి వెళ్తున్న సందర్భంగా విమానాశ్రయంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ బీటీ నాయు డు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, సతీమణి మల్లె జ్యోతి, ఎమ్మెల్సీ అనురాధ, పత్తికొండ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యామ్‌బాబు, ఆలూరు ఇన్‌చార్జి కోట్ల సూజాతమ్మ, కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్, ఆదోని టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షీనాయుడు, టీడీపీ నాయకుడు ఎదురూర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మిగనూర్ జనసేన నాయకులు రేఖ, జనసేనాయకుడు హర్షత ఘనస్వాగతం పలికారు.

14 నుంచి దేవాలయాల స్వచ్ఛత : కేంద్ర మంత్రి

కర్నూలు(కల్చరల్), జనవరి 9: ఈనెల 14 నుంచి దేవాలయాల స్వచ్ఛత కార్యక్రమం చేపట్టాలని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ బాగల్ పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి నగరంలోని 46వ వార్డు నరసింహారెడ్డి నగర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర ఆధ్వర్యంలో, 'దేవాలయాల్లో పరిశుభ్రత కొరకు భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు' అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలకంఠయ్య, నాయకులు శ్రీరాములు, కోటి యాదవ్, రామాంజినేయులు, లోకేశ్వరయ్య భగత్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ బాగేల్, బీజేపీ నాయకులు

పెద్దాసుపత్రిలో కేంద్ర ఆరోగ్య మంత్రి

కర్నూలు(హాస్పటల్)జనవరి 9: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న రోగులను కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ బాగేల్ మంగళవారం సాయంత్రం పరామర్శించారు. ఈ సందర్భంగా క్యాజువాల్టీలో రోగులతో మాట్లాడి వాళ్లకు ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. అనంతరం రోగుల అడ్మిషన్ ఓపీ, రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆయన వెంట రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, ఆసుపత్రి సూపరిటెండెంట్ వెంకటరంగారెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్ ఉన్నారు.

ఉద్రిక్తతగా మారిన జైల్‌భరో

● పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట
● జీవో నెం-2ను రద్దు చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తాం
● తేల్చి చెప్పిన పలు సంఘాల నాయకులు

కర్నూలు(హాస్పిటల్), జనవరి 9: అంగన్‌వాడీల సమ్మెను భగ్నం చేయడానికి ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం-2ను రద్దు చేయాలని కోరుతూ కార్మిక సంఘాలు చేపట్టిన జైల్‌భరో కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. మంగళవారం సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూల ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్‌ను కార్మిక సంఘాల నాయకులు ముట్టడించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా నాయకులు కలెక్టరేట్ గేట్లు ఎక్కారు. పోలీసులు, సంఘం నాయకులకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు కొందరి సంఘ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు రాస్తోరోకో నిర్వహించారు. అనంతరం వందలాది మంది కార్మిక సంఘం నాయకులు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు మునెప్ప, అంజిబాబు, సీఐటీయూ రాష్ట్ర నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రామికపోరం నాయకురాలు నిర్మలమ్మ మాట్లాడారు. శాంతియుతంగా ఆందళోన చేస్తున్న అంగన్‌వాడీల సమ్మెను భగ్నం చేయడానికి ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దారుణమన్నారు. బెదిరింపులతో కాకుండా చర్చల ద్వారా పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావాలని, లేకపోతే వైసీపీ ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. సమ్మెకు మద్దతుగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఏఐటీయూసీ నాయకులు వెంకటేష్, రామాంజనేయులు, పురుషోత్తం, ఈశ్వర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ, నాయకులు సాయిబాబా, విజయ్, రామకృష్ణ, రాముడు పాల్గొన్నారు.



నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



గూడూరులో జీవో పత్రాలను దహనం చేస్తున్న దృశ్యం

పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం

గూడూరు జనవరి 9: అంగన్‌వడీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె.మోహన్ అన్నారు. మంగళవారం అంగన్‌వాడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గూడూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె 29వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీల సమ్మెపై తప్పుడు ప్రచారం చేసిన ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణా రెడ్డి చిత్ర పటాలను అంగన్‌వాడీ కార్మికులు దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె.మోహన్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు అరుణ, ఇందుమతి, మద్దమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించమని గత 29 రోజులుగా సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరచి అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు రత్నమ్మ, అనంతమ్మ, సుజాత, మంజుల, మహేశ్వరి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో 12 మంది డీబార్

కర్నూలు(అర్బన్), జనవరి 9: డిగ్రీ 1, 3 సెమిస్టర్ పరీక్షల్లో 12 మంది విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్ష విభాగం కంట్రోలర్ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 16 పరీక్షా కేంద్రాల్లో 1వ సెమిస్టర్లో 5599 మందికి 4777, 3వ సెమిస్టర్లో 10232 మంది దరఖాస్తు చేసుకోగా 9347 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు.

నేటి నుంచి చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు

కర్నూలు(కల్చరల్), జనవరి 9: నగరంలోని టీజీవీ గ్రూప్స్ జూనియర్ ఛైర్మన్, ప్రజా నాయకుడు టీజీ భరత్ ఆధ్వర్యంలో, ప్రముఖ ప్రవచన చక్రవర్తి, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనామృతం కార్యక్రమం బుధవారం, గురువారం ఏర్పాటు చేసినట్లు టీజీ భరత్ యూత్ సభ్యుడు జగదీష్ గుప్త ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఎస్‌ఏపీ క్యాంపులోని టీజీ వెంకటేశ్ అవుట్‌డోర్ స్టేడియంలో సాయంత్రం 5.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. బుధవారం సాయంత్రం 'గోమాత వైభవం' అనే అంశంపై, గురువారం సాయంత్రం 'జగన్మాత వైభవం' అనే అంశంపై చాగంటి కోటేశ్వరరావు ప్రవచన బోధనలు చేస్తారని ఆయన పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమానికి కృషి చేస్తా

కర్నూలు కలెక్టరేట్ జనవరి 9 : ఆర్థిక పరమైన అంశాలు, క్షేత్ర స్థాయిలో ఉన్న ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి రాష్ట్రభివృద్ధి, ప్రజల సంక్షేమానికి మరింత కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఎస్టిమేట్స్ కమిటీ ఛైర్మన్ పాలకొండ నియోజక వర్గ ఎమ్మెల్యే కళావతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ ఛైర్మన్ కళావతి మాట్లాడుతూ రోడ్ల నిర్మాణంలో భాగంగా గ్రామాల పేర్లు ఉండే విధంగా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

బైకు దొంగ అరెస్టు

కర్నూలు, జనవరి 9: రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ చోరీకి పాల్పడిన పవన్‌కుమార్‌ను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అజీస్ అనే విద్యార్థి ఈ నెల 6న రాజ్ విహార్ బస్టాపులో బైక్ పార్క్ చేసి కళాశాలకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం వచ్చి చూస్తే బైక్ కనిపించలేదు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ద్వారా నిందితుడ్ని గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడు బుధవారపేటకు చెందిన వాడిగా గుర్తించారు.

ఆళ్లగడ్డకు తరలిన నాయకులు



ఆళ్లగడ్డకు బయలుదేరి వెళ్తున్న నాయకులు

ఓర్వకల్లు జనవరి 9: అళ్లగడ్డ పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపట్టిన రా కదలిరా కార్యక్రమానికి మంగళవారం మండలం నుంచి దాదాపు 80 వాహనాలలో నాయకులు తరలివెళ్లారు. మండలంలోని ఓర్వకల్లు, నన్నూరు, ఉయ్యాలవాడ, లొద్దిపల్లె, శకునాల, ఉశేనాపురం, కన్నమడకల, తదితర గ్రామాల నుంచి భారీ ఎత్తున తరలి వెల్లారు ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, సుధాకర్‌రావు, అల్లబాబు, సుదాకర్, రామగోవిందు పాల్గొన్నారు.

ఇంటర్ విద్య కీలకం



మాట్లాడుతున్న జిల్లా వృత్తి విద్యా అధికారి జమీర్ పాషా

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 9 : విద్యార్థి దశలో ఇంటర్ విద్య కీలకమని డీవీఈవో జమీర్ పాషా, విశ్రాంత ప్రిన్సిపాల్ కొట్టే చెన్నయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బి. క్యాంపు ప్రభుత్వ వృత్తివిద్యా కళాశాల స్నాతకోత్సవ వేడుకలు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. నాగ స్వామి నాయక్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్ పబ్లిక్ పరీక్షలు సమయం దగ్గర పడుతుందని సమయాన్ని వృధా చేయరాదన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొన్ని దాన్ని సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగ స్వామి నాయక్ ఈ విద్యా సంవత్సరం సాధించిన అభివృద్ధిని వెల్లడించారు. కార్యక్రమములో కర్నూలు టౌన్ మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ సి.సుంకన్న, రామకృష్ణ సేవా సమితి ప్రతినిధి శారద, అధ్యాపకులు లక్ష్మీప్రసన్న విజయశేఖర్ పాల్గొన్నారు.

శ్రీమఠానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం, జనవరి 9: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన నీలం అనే భక్తురాలు మంగళవారం రూ.లక్ష సంపూర్ణ సేవకు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి తెలిపారు. మంగళవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాత కుటుంబ సభ్యులను పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీర్వదించారు.

కుంకనూరులో దొంగతనం

దేవనకొండ, జనవరి 9 : మండలంలోని కుంకనూరు గ్రామంలో రెండు నెలల కింద వలస వెళ్లిన తలారి శేఖర్ ఇంట్లో దొంగతనం జరిగింది. ఇంటి దగ్గర తల్లికి ఉంచి వలస వెళ్లిన శేఖర్ సోమవారం సాయంకాలం గ్రామానికి చేరుకొని ఇంట్లో వున్న బీరువా తెరచి చూశాడు. అందులో ఉన్న ఉండాల్సిన 4 తులాలు బంగారు ఆభరణలు, రూ.1.8 లక్షల నగదు కనిపించలేదు. ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై భూపాలుడు కేసు నమోదు చేసుకున్నారు.

కేంద్ర ఎన్నికల సంఘం సమావేశంలో కలెక్టర్, ఎస్పీ



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

కర్నూలు కలెక్టరేట్, జనవరి 9: లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం విజయవాడలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ప్రత్యేకంగా సమావేశమైంది. కర్నూలు జిల్లా నుంచి కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా తయారీతో పాటు శాంతి భద్రతల అంశాలపై కేంద్ర ఎన్నికల సంఘానికి వివరించారు.

భూ సమస్యలను పరిష్కరించాలి

ఆదోని రూరల్, జనవరి 9: భూ సమగ్ర సర్వేలో లోపాలను సరి చేసి ప్రజల భూ సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు లింగన్న, వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం వారు రైతులతో కలిసి తహసీల్దార్ వెంకటలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ భూ రీసర్వేలో భాగంగా చాలా మంది రైతులు భూ సమస్యలతో సతమతమవుతున్నారని, వారి సమస్యలను కూడా పరిశీలించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

ఆదోని రూరల్, జనవరి 9 : త్వరలో సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు సహకరించాలని, అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఆదోని డీఎస్పీ శివ నారాయణ స్వామి తెలిపారు. మంగళవారం రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, తాలుకా ఎస్ఐ ఎర్రిస్వామితో కలిసి విరుపాపురం, సలకలకొండ, సాదాపురం, గొనబావి, తదితర గ్రామాల్లో పర్యటించి, పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని ప్రజలకు సూచించారు.

ఉపాధ్యాయుల అరెస్టు అన్యాయం

ఆదోని (అగ్రికల్చర్), జనవరి 9 : సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులను అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గాదిలింగప్ప అన్నారు. మంగళవారం యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో యూటీఎఫ్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ విజయవాడ ఉపాధ్యాయులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖన్న, నారాయణ, కృష్ణుడు, మల్లయ్య, లింగన్న, సుధాకర్ నాయుడు, వీరన్న, రాజ, హుసేన్ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఆదోని (అగ్రికల్చర్), జనవరి 9: రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధనాపురం ఉదయ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాల రహదారిపై నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదని ఉపాధ్యాయ అభ్యర్థులను మోసం చేసిందని ఆరోపించారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తుందని రూ.వేల ఖర్చు పెట్టి కోచింగ్ తీసుకొని, నోటిఫికేషన్ విడుదల కాకపోవడంతో నిరుత్సాహంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు వంశీ, రఘు, గిడ్డయ్య, నితిన్ పాల్గొన్నారు.

మండల సమస్యలపై కేంద్ర మంత్రికి వినతి

తుగ్గలి, జనవరి 9: మండలంలో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్‌గౌడు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బాగేల్‌ని కోరారు. మంగళవారం జిల్లా పర్యటనలో ఉన్న కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రిని కర్నూలులో మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు విన్నవించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీన పగిడిరాయి గ్రామంలో నిర్వహించనున్న వికసిత్ భారత్ కార్యక్రమంలో మంత్రి పాల్గొననున్నారని, సమస్యలు ఉంటే కేంద్ర మంత్రి దృష్టికి తేవాలని కోరారు.

కురువలకు ఎమ్మెల్యే సీటు కేటాయించాలి

ఆదోని, జనవరి 9: ఆదోని ఎమ్మెల్యే టికెట్‌ను కురువలకు కేటాయించాలని కురువ సంఘం నాయకుడు భానుప్రకాష్ కోరారు. మంగళవారం స్థానిక బీరప్ప స్వామి దేవాలయంలో కురువ కులస్తుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండు ఎమ్మెల్యే టికెట్‌లు, ఒకటి ఎంపీ టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కురువలు రాజకీయంగా ఎదగాలంటే అత్యధికంగా ఓట్లు ఉన్న కురువ సామాజిక వర్గానికే ఆదోని టీడీపీ ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. మరో నాయకుడు వీరేష్ మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలోని మాన్వి దేవేంద్రప్పకు ఆదోని నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కురువ సంఘం నాయకులు రమేష్, బీఎస్ టాకీస్ వెంకటేష్, ద్వారక రెడ్డి, వెంకటేష్, హాల్వి గర్జప్ప, పరమేష్, గర్జప్ప, నాగరాజు పాల్గొన్నారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

మంత్రాలయం, జనవరి 9: రాబోయే ఎన్నికలను అధికారులు సమష్టిగా సమర్థవంతంగా నిర్వహించాలని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య సూచించారు. మంగళవారం మంత్రాలయం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో మంత్రాలయం నియోజకవర్గంలోని పోలీస్, పోలింగ్ స్టేషన్‌ల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గంలో 1,97,728 మంది ఓటర్లు ఉన్నారని 237 పోలింగ్ బూతులు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మంత్రాలయం, కోసిగి సీఐలు శ్రీనివాసులు, ప్రసాదు, ఎస్ఐ వేణుగోపాలరాజు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు శశిశేఖర్‌రావు, ఏఎస్ఐలు ఆనంద్‌రెడ్డి, బందెనవాజ్, నటరాజ్, ఏఈఈ నరసింహులు, వీరేష్, బందెనవాజ్, వివిధ పోలీస్ స్టేషన్‌ల అధికారులు పాల్గొన్నారు.

శ్రీమఠానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం, జనవరి 9: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన నీలం అనే భక్తురాలు మంగళవారం రూ.లక్ష సంపూర్ణ సేవకు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి తెలిపారు. మంగళవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాత కుటుంబ సభ్యులను పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీర్వదించారు.

కుంకనూరులో దొంగతనం

దేవనకొండ, జనవరి 9 : మండలంలోని కుంకనూరు గ్రామంలో రెండు నెలల కింద వలస వెళ్లిన తలారి శేఖర్ ఇంట్లో దొంగతనం జరిగింది. ఇంటి దగ్గర తల్లికి ఉంచి వలస వెళ్లిన శేఖర్ సోమవారం సాయంకాలం గ్రామానికి చేరుకొని ఇంట్లో వున్న బీరువా తెరచి చూశాడు. అందులో ఉన్న ఉండాల్సిన నాలుగు తులాలు బంగారు ఆభరణలు, రూ.1.8 లక్షల నగదు కనిపించలేదు. ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై భూపా లుడు తమ సిబ్బందితో ఘటన స్థలాని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.



ఆదోనిలో భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న దృశ్యం



కౌతాళం మండలం వల్లూరు గ్రామంలో వడ్డె ఈరమ్మకు నివాళి అర్పిస్తున్న భువనేశ్వరి



ఓర్వకల్లు విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న బీటీ నాయుడు

పల్లెపల్లెనా భువనేశ్వరికి ఘన స్వాగతం





కర్నూలు, జనవరి 9(ఆంధ్రజ్యోతి)/ఎమ్మిగనూరు/ఆదోని: నిజం గెలవాలి యాత్రలో భాగంగా జిల్లాకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరికి పల్లెపల్లెన ప్రజలు నీరాజనాలు పలికారు. అమ్మను చూడాలి.. ఆశీర్వచనాలు అందించాలంటూ పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు, మహిళలు రోడ్లపైకి వచ్చి అభివాదం తెలిపారు. పెద్దకడుబూరు, కోసిగి, దుద్ది, కోలమాన్‌పేట, అర్లబండ, హాల్వి గ్రామాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు, జనం రోడ్లపైకి వచ్చి భువనేశ్వరికి హారతులు పట్టారు. కోసిగిలో భువనేశ్వరిని చూసి ఆశీర్వదించేందుకు వాల్మీకి సర్కిల్‌కు ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. వల్లూరు నుంచి మంత్రాలయానికి బయల్దేరిన భువనేశ్వరికి కడుదొడ్డి, కందుకూరు, సాతనూరు, అగసనూరు, నారాయణపురం, తుంగభద్ర గ్రామాల్లో సైతం రాత్రి అయినా కూడా భువనేశ్వరిని చూసేందుకు రోడ్లపైకి చేరుకొని అభివాదం చేస్తూ అభిమానాన్ని చాటుకున్నారు.

● ఆదోనిలో భువనేశ్వరి బస

'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా పెద్దకడుబూరు, కౌతాళం, మంత్రాలయం మండలాల్లో చంద్రబాబు అరెస్టు సమయంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించిన అనంతరం రాత్రి సుమారు 9గంటల సమయానికి ఆదోనికి చేరుకున్నారు. మండిగిరిలోని చేకూరి పుల్లయ్య ఫంక్షన్‌హాల్‌లో రాత్రి బసచేశారు. ఆదోని ఇన్‌చార్జి మీనాక్షినాయుడు ఆధ్వర్యంలో భువనేశ్వరితో పాటు యాత్రలో పాల్గొన్న టీం సభ్యులకు బస ఏర్పాట్లు చేశారు. ఆదోని మండలం అరెకల్లు గ్రామ శివారులో నారా భువనేశ్వరికి మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో తెలుగు యూత్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, బత్తిన కుబేర్‌నాథ్, మారుతి నాయుడు, రంగన్న, రామకృష్ణ, తిమ్మప్ప, బాబు నాయుడు, బంగారు సుధాకర్ పాల్గొన్నారు.

విమానాశ్రయంలో ఘన స్వాగతం

రెండు రోజుల పర్యటనలో భాగంగా జిల్లాకు వచ్చిన భువనేశ్వరికి టీడీపీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఓర్వకల్లు విమానాశ్రయంలో చేరుకున్న ఆమెకు టీడీపీ జిల్లా అధ్యక్షులు బీటీ నాయుడు సహా పలువురు టీడీపీ నాయకులు స్వాగతం పలికి ఆమెతో పాటు యాత్ర కొనసాగించారు. గోనెగండ్ల మండలం గాజులదిన్నె దగ్గర ఎమ్మిగనూరు టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి భువనేశ్వరికి స్వాగతం పలికారు. భువనేశ్వరికి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అక్కడే మధ్యాహ్న భోజనం అనంతరం మంత్రాలయం నియోజకవర్గానికి బయల్దేరారు. పెద్దకడుబూరు చేరుకున్న భువనేశ్వరికి మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు.

● మీ సమస్యలు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తా

అంగన్‌వాడీ వర్కర్లు 29 రోజులుగా చేస్తున్న సమ్మె న్యాయబద్ధమైంది. మీ డిమాండ్లు న్యాయమైనవే. మీ సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి మన ప్రభుత్వం రాగానే పరిష్కరించాలని తప్పకుండా చెబుతానని అంగన్‌వాడీ వర్కర్లకు నారా భువనేశ్వరి భరోసా ఇచ్చారు. పెద్దకడుబూరులో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు భువనేశ్వరిని కలిసి తమ సమస్యల పరిష్కారం దిశగా కృషి చేసేలా టీడీపీ మద్దతు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ అంగన్‌వాడీలకు ఎప్పుడు అండగా ఉంటుందని భువనేశ్వరి వివరించారు. త్వరలో టీడీపీ ప్రభుత్వం వస్తుందని, అంగన్‌వాడీల సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఆమె భరోసానిచ్చారు.



ఆదోనిలో మాట్లాడుతున్న వెంకటమ్మ



ఆలూరులో గుంజిళ్లు తీస్తున్న అంగన్‌వాడీలు

హామీలు నెరవేర్చమంటే... ఎస్మా ఏందన్నా!

● సీఎం జగన్‌ను ప్రశ్నించిన అంగన్‌వాడీలు ● 29వ రోజు కొనసాగిన నిరసనలు

ప్రభుత్వం తమను ఎన్ని రకాలుగా బెదిరించినా భయపడేదే లేదని, న్యాయపరమైన డిమాండ్ల సాధనే లక్ష్యంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. సమస్యల పరిష్కారానికి చేపట్టిన సమ్మె మంగళవారానికి 29 వరోజుకు చేరింది. జిల్లాలో అన్ని మండలాల్లో విభిన్న రీతుల్లో నిరసనలను కొనసాగించారు. ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ నియోజకవర్గాల్లో సమ్మె చేపట్టారు.



ఎమ్మిగనూరులో ఆందోళన



పత్తికొండలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు



ఆస్పరి పోలీస్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, సీపీఐ, సీపీఎం నాయకులు

పారిశుధ్య కార్మికుల భిక్షాటన

ఆదోని టౌన్, జనవరి 9 : మున్సిపల్ కాంట్రాక్టు పారిశుద్ధ కార్మికులు మంగళవారం ప్రధాన వీధులలో భిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు మాట్లాడుతూ, కార్మికుల పట్ల ప్రభుత్వ నిరంకుశత్వ ధోరణి సరికాదని విమర్శించారు. ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వెంకన్న, పట్టణ అధ్యక్షుడు వైడీ భీమేష్, జిల్లా సమితి సభ్యుడు శెక్షావలి, హుసేని, సీపీఐ పట్టణ మండల కార్యదర్శి సుదర్శన్, కల్లుబావి రాజు, మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సంఘం నాయకులు జాన్‌బాబు, శేఖర్, చిన్న ఎల్లప్ప, శాంత, నరసింహులు పాల్గొన్నారు.

బైకు ర్యాలీతో స్వాగతం

మంత్రాలయం, జనవరి 9: 'నిజం గెలవాలి' పర్యటనలో భాగంగా మంత్రాలయానికి వస్తున్న నారా భువనేశ్వరికి మంగళవారం రాత్రి మాధవరం వద్ద భారీ ఎత్తున బైకు ర్యాలీతో స్వాగతం పలికారు. నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకరరెడ్డి ఆధ్వర్యంలో మంత్రాలయం వరకు భారీ బైకు ర్యాలీ నిర్వహించారు.

టీడీపీలోకి వైసీపీ కార్యకర్తలు



టీడీపీలో చేరిన నాయకులు

ఎమ్మిగనూరు, జనవరి 9: బోడబండ గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు మంగళవారం మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన ఉలవ వెంకటేష్, వీరేష్, కృష్ణ, సురేష్, నరసింహులు, రామకృష్ణ, నారాయణలతో పాటు మరో 50 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి జయనాగేశ్వరరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి

ఆలూరు, జనవరి 9: ఎన్నికలకు అధికారులందరూ సిద్ధం కావాలని ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జున అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, తహసీల్దార్లు రామాంజినేయులు, సోమశేఖర్, డీటీ గుండాల నాయక్, బసన్న గౌడ్ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు కింద అరెస్టు చేయాలి

ఆలూరు, జనవరి 9: ఆలూరు పట్టణానికి చెందిన మాదిగ లక్ష్మి, ఆమె కుమారులు శివ, రాజశేఖర్‌లపై దాడి చేసిన బోయ వర్గానికి చెందిన రవి, ఎంకమ్మ, రంగమ్మ, విష్ణులను ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు కింద అరెస్టు చేయాలని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామతీర్థం అమ్రేష్ మాదిగ కోరారు. మంగళవారం ఆయన పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఆలూరు మండల అధ్యక్షుడు హులేబీడు రామాంజి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కదిరికోట బతుకమ్మ, రామలింగ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల అరెస్టు సిగ్గుచేటు

పెద్దకడుబూరు, జనవరి 9: ఉపాధ్యాయులను అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటు అని యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రశాంత్‌భూపాల్, శివకుమార్ అన్నారు. పెద్దకడుబూరులో వారు మాట్లాడుతూ విజయవాడలో శాంతియుతంగా చేసే ధర్నాను భగ్నం చేస్తూ ఉపాధ్యాయులను అరెస్టు చేయడం దారుణమన్నారు.

మద్యం అక్రమంగా విక్రయంపై పోలీసుల దాడి

ఆదోని, జనవరి 9: కర్ణాటక అక్రమ మద్యం విక్రయిస్తున్న వారిపై సెబ్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఆదోని పట్టణంలోని లక్ష్మీనారాయణ అనే వ్యక్తి తన కర్ణాటక మద్యం ప్యాకెట్లను విక్రయిస్తుండగా అరెస్టు చేశారు. అలాగే ఇందిరానగర్ కాలనీలో దాడులు నిర్వహించి అక్కడ లక్ష్మి అనే మహిళ వద్ద 15 లీటర్ల నాటుసారా ఉండటం గుర్తించి అరెస్టు చేశారు.

అంబేడ్కర్ ఆశయాలపై ప్రతిజ్ఞ

మద్దికెర, జనవరి 9 : అంబేద్కర్ ఆశయాలను అనుసరిస్తామని మద్దికెర గ్రామపంచాయతీలో సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. సర్పంచు బండారు సుహాసిని ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈవోఆర్డీ మద్దిలేటిస్వామి, ఉపసర్పంచు ప్రమీలమ్మ, లక్ష్మీనారాయణ ఉన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేస్తాం

● ఆలూరులో గర్జించిన జనసేన ఇన్‌చార్జి వెంకప్ప



ఆలూరు, జనవరి 9: రాష్ట్రంలో అరాచక పాలనను సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో భూస్థాపితం చేస్తామని ఆలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి తెర్నేకల్ ఆదోని ఇన్‌చార్జి మల్లప్ప అన్నారు. మంగళవారం ఆలూరు పట్టణంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. అనంతరం స్థానిక ఉమా కళ్యాణ మండపంలో నిర్వహించిన ఆలూరు నియోజకవర్గ స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పేరిట కోట్ల రూపాయల ప్రజాధనాన్ని జగన్ దోచుకుంటున్నారన్నారు. మద్యం, ఇసుక, భూఅక్రమాల దందాల్లో అధికార పార్టీ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు మునిగి తేలుతారని అన్నారు. నాలుగున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర అంతృప్తి నెలకొందన్నారు. ఆలూరు ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో మంత్రి జయరాం విఫలమయ్యారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన సారథ్యంలో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాన్ని అంతం చేసి అధికారంలోకి వస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు చత్రపతి, రంజిత్, వివిధ మండలాల జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు.

గుమ్మనూరుకు టికెట్ కేటాయించాలి



మాట్లాడుతున్న గుమ్మనూరు శ్రీనివాసులు, తనయుడు ఈశ్వర్

ఆలూరు, జనవరి 9: ఆలూరు ఎమ్మెల్యే టికెట్ మరోసారి మంత్రి గుమ్మనూరు జయరాంకు ఇవ్వాలని వైసీపీ నాయకులు ఆ పార్టీ పెద్దలను కోరారు. మంగళవారం ఆలూరు పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి జయరామ్ సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు, మంత్రి తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ నారాయణ జెడ్పీటీసీలు ఏరూర్ శేఖర్, కిట్టు, లింగప్ప మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, ఫ్యాక్షనిజాన్ని రూపుమాపి ప్రశాంతంగా ఉండేందుకు కృషి చేసిన మంత్రి జయరాం సేవలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గుర్తించి మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. జయరాం బదులు మరొకరికి టికెట్ ఇస్తే సహకరించమని తెలిపారు. సమావేశంలో వైసీపీ మండల కన్వీనర్లు మారయ్య, మల్లికార్జున, వీరేష్, బిమప్ప చౌదరి, గోవర్ధన్ నాయకులు రామ్‌భీం నాయుడు, ముంబా, వీరాంజనేయులు, శ్రీనివాసులు, శ్రీదర్, విక్రాంత్ రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన వైకుంఠం శివప్రసాద్, జ్యోతి

ఆలూరు, జనవరి 9: టీడీపీ అధినేత నారా చంద్రాబునాయుడును మంగళవారం ఆళ్లగడ్డలో ఆలూరు మాజీ టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం శివ ప్రసాద్, జ్యోతి దంపతులు హెలిప్యాడ్ వద్ద కలిసి స్వాగతం పలికారు. అనంతరం నారా భువనేశ్వరిని కలసి పుష్పగుచ్ఛం అందించారు.

పార్టీ కోసం శ్రమిస్తాం

చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయడానికి శ్రమిస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం మల్లికార్జున, శశిసుధ అన్నారు. మంగళవారం ఆళ్లగడ్డకు వచ్చిన నారా చంద్రబాబు నాయుడును, నార భువనేశ్వరిని కలసి పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు. రాష్ట్రంలో అవినీతి పాలనను సాగిస్తున్న జగన్ పాలనను సాగనంపుతామన్నారు.

కూలిపోయిన ఓవర్ బ్రిడ్జి గోడ

● కడ్డీల ఆధారంతో వేలాడిన వ్యక్తి

● కాపాడిన ఆటో డ్రైవర్

ఆదోని, జనవరి 9: ఆదోని ఓవర్ బ్రిడ్జి గోడ కూలిపోయి, దాని పక్కనే నడుస్తూ దానిని తగిలిన సోమన్న అనే వ్యక్తి కూడా పడబోయి గోడకు ఉన్న కడ్డీలు పట్టుకొని వేలాడి ప్రాణాలు కాపాడుకున్నాడు. ఈ ఘటన మంగళవారం ఆదోనిలో జరిగింది. సోమన్న తనను కాపాడమని కేకలు వేయడంతో ఆటోడ్రైవర్ గమనించి తాడు అందించాడు. ఆ తర్వాత పెద్ద వాహనం క్యాబిన్‌పై నుండి అతను దిగడానికి ఏర్పాటు చేశారు. ఓవర్ బ్రిడ్జి గోడకు కనీసంగా మరమ్మతు చేయకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు అన్నారు.



కూలిపోయిన బ్రిడ్జి కడ్డీని పట్టుకుని వేలాడుతున్న సోమన్న